

ప్రకృతిలో పక్షుల సోయగం
కవ్వాల్ అడవులు పక్షులకు ఆవాసాలుగా మారాయి. ఇక్కడ రకరకాల పక్షులు విహరిస్తున్నాయి. అటవీ అధికారులు తీసిన ఫొటోల్లో వాటి సోయగాలు కనిపించాయి. 8లో▸



పండ్లకు భలే గిరాకీ 9లో▸
వేసవిలో పండ్లకు గిరాకీ పెరిగింది. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు చల్లదనాన్నిచ్చే పండ్లు కొనుగోలు చేస్తున్నారు. జ్యూస్ సెంటర్ల వద్ద బారులు తీరుతున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
41.0/27.0

వాతావరణం
ఆకాశం కొంత మేర మేఘావృతమై ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఎండ తీవ్రత కొనసాగుతుంది.



న్యూస్‌రీల్

నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ఆసిఫాబాద్‌రూరల్: తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఆరు నుంచి 10వ తరగతిలో చేరేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహణ కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, ప్రిన్సిపాల్ అబ్దుల్‌ఖలీల్ శనివారం తెలిపారు. జిల్లాలో ఆసిఫాబాద్‌లో ఐదు సెంటర్లు, సిర్పూర్(యూ) ఒక సెంటర్ ఏర్పాటు చేశారు. ఆరోతరగతిలో చేరేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఉదయం 10నుంచి 12గంటల వరకు పరీక్ష నిర్వహించనుండగా 779 మంది రాయనున్నారు. ఏడు నుంచి 10వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మధ్యాహ్నం 2నుంచి 4గంటల వరకు పరీక్ష నిర్వహించనుండగా 683 మంది రాయనున్నారు. విద్యార్థులు 30 నిమిషాల ముందు కేంద్రాలకు చేరుకోవాలని, హాల్‌టికెట్, ప్యాడ్, పెన్నుతో హాజరుకావాలని సూచించారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి



భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్స్‌లో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఇచ్చిన ఇఫ్తార్ విందులో అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సుకోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, కెరమెరి వైస్ ఎంపీపీ అబుల్ కలాం, మైనార్టీ నాయకులు అహ్మద్, అబుల్ ఫయాజ్, మీర్ సాబీర్ అలీ, రహమాన్, ముషీరొద్దీన్, నజీర్, నిసార్ పాల్గొన్నారు.

‘ఓపెన్’ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

ఆసిఫాబాద్‌రూరల్: ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే సూచించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయితో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ‘పది’ పరీక్షల కోసం ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో ఒక్కో సెంటర్, ఇంటర్ కోసం ఆసిఫాబాద్‌లో ఒకటి, కాగజ్‌నగర్‌లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా విద్యార్థుల కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. డీఈవో అశోక్, పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు, డీఐఈవో శ్రీధర్ సుమన్ తదితరులున్నారు.



కెరమెరిలో దుక్కి దున్నుతున్న రైతు

విత్తన భారం

ఇప్పటికే ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగి పెట్టుబడి ఖర్చులు మోయలేని స్థితిలో ఉన్న పత్తి రైతులపై మరో పిడుగు పడింది. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక డీలా పడ్డ రైతాంగంపై విత్తన భారం పడబోతోంది. ఒక్కో విత్తన బ్యాగ్‌పై ప్రభుత్వం రూ.43 పెంచింది. దీనిపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పత్తి విత్తన ప్యాకెట్ ధర గతంలో రూ.810 ఉండగా ప్రస్తుతం రూ.853కు చేరింది. ఈ లెక్కన జిల్లా రైతులపై రూ.2.88 కోట్ల భారం పడనుంది.

- ఈసారి పెరిగిన ధర.. రైతుల్లో దడ
- గతేడాది ఒక్కో ప్యాకెట్‌కు రూ.810
- రూ.43 పెరిగి రూ.853కు చేరిన ధర
- జిల్లా రైతులపై రూ.2.88 కోట్ల భారం
- దిగులు చెందుతున్న పత్తి రైతులు

కెరమెరి(ఆసిఫాబాద్): పత్తి పండించే రైతులు విత్తనాలను ప్రైవేట్‌గా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. పలు కంపెనీలు వివిధ రకాల విత్తనాలను మార్కెట్‌లో ప్రవేశ పెట్టడంతో వాటి ధరలపై కేంద్ర ప్రభుత్వం నియంత్రణ విధించింది. ఏటా విత్తన తయారీ, ఇతర ఖర్చులు లెక్కించి ధర నిర్ణయిస్తుంది. అలా ప్రకటించిన ధరకే కంపెనీలు విత్తనాలు విక్రయించాలి. మార్కెట్‌లో బీటీ-1, బీటీ-2 రకాలు అందుబాటులో ఉంటాయి. అయినప్పటికీ ఎక్కువ మొత్తంలో బీటీ-2 విత్తనాన్నే ఎక్కువగా సాగు చేస్తారు. జిల్లాల సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉండగా ఏటా 6.70లక్షల ప్యాకెట్ల కొనుగోళ్లు జరుగుతాయి.

నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట పడేనా?
జిల్లాలో 4.50లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా, 3.45 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. ఒక్కో ఎకరాకు రెండు విత్తన ప్యాకెట్లు వినియోగిస్తారు. జిల్లాకు 6.70లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరం. కాగా, ఏటా నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి వస్తున్నాయి. అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా అనుకున్న స్థాయిలో నియంత్రించలేకపోతున్నారు. జిల్లాలోని కెరమెరి, సిర్పూర్(టి), జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, నార్నూర్, వాంకిడి, తిర్యాణి తదితర మండలాల్లో నకిలీ విత్తనాల అమ్మకాలు జోరుగా సాగుతాయి.



పత్తి విత్తన బ్యాగులు

విత్తనాలపై అవగాహన తప్పనిసరి
ఏటా నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి విచ్చలవిడిగా వస్తుండగా వ్యవసాయశాఖ అధికారులు నియంత్రించడంలేదనే ఆరోపణలున్నాయి. పత్తి విత్తనాలపై రాయితీని ఎత్తేసిన ప్రభుత్వం కనీసం నకిలీ విత్తనాలను అరికట్టేందుకు సరైన చర్యలు చేపట్టడం లేదని రైతులు వాపోతున్నారు. అసలు ఏయే కంపెనీలకు ప్రభుత్వ అనుమతి ఇచ్చింది.. ఎంత ధర నిర్ణయించింది.. అనే అంశాలపై రైతులకు అవగాహన అవసరం. వచ్చే సీజన్‌లో విత్తన ప్యాకెట్లపై క్యూఆర్ కోడ్ ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. దీని ద్వారా ఆ విత్తనాలను ఏ కంపెనీ తయారు చేసింది.. లాట్ నంబర్, విత్తన రకం తదితర వివరాలు తెలుసుకోవచ్చు.

సాగు భారమవుతోంది



నాకు పదెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఏటా 20 ప్యాకెట్ల పత్తి విత్తనాలు కొనుగోలు చేస్తా. ఈసారి ఒక్కో ప్యాకెట్‌పై రూ.43 పెరగగా అదనంగా రూ.860 భారం పడుతోంది. ఎరువులు, పురుగుల మందుల ధరలు కూడా పెరిగాయి. కూలీల రేట్లు కూడా పెరగడంతో సాగు భారంగా మారుతోంది.

– పెందోర్ జలపతిరావు, సాకడ

నకిలీవి కొని మోసపోవద్దు



రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దు. లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే పత్తి విత్తనాలు కొనుగోలు చేయాలి. ఈ సారి ఒక్కో ప్యాకెట్‌పై రూ.43 పెరిగింది. ధర పెరిగిందని నకిలీ విత్తనాలు కొనుగోలు చేస్తే తీవ్రంగా నష్టపోతారు. ఎవరైనా అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే సమాచారం ఇవ్వాలి

– శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి

సాగునీటి ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, పాల్గొన్న ఇరిగేషన్ అధికారులు

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- అధికారులతో సమీక్షా సమావేశం

ఆసిఫాబాద్: వానాకాలంలోపు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో మిగిలిపోయిన పనులు వానాకాలం ప్రారంభమయ్యేలోపు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, వచ్చే ఖరీఫ్‌లో సాగునీరందించేలా దృష్టి సారించాలని తెలిపారు. పరిపాలన అనుమతులు పొందిన పనులు ప్రారంభించాలని, చెరువులు, కాల్వలు, ప్రాజెక్ట్‌ల మరమ్మతు పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి చేయాల్సిన పనుల వివరాలతో నివేదిక రూపొందించాలని తెలిపారు. అడ ప్రాజెక్ట్ ప్రధాన కాల్వ తెగిపోయిన చోట మరమ్మతు పనులు పూర్తి చేయాలని, ప్రాధాన్యత క్రమంలో అవసరమున్న పనులు ముందుగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పనుల్లో అలసత్వం, నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఇరిగేషన్ ఈఈలు గుణవంత్‌రావు, ప్రభాకర్, డీఈఈలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి
జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇంజినీరింగ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో చేపట్టిన వంతెనల నిర్మాణాలు, ‘మన ఊరు–మన బడి’ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. జైనూర్ మండలం కిషన్‌నాయక్ తండా వద్ద చేపట్టిన వంతెన నిర్మాణ పనులు మే చివరిలోపు పూర్తి చేయాలన్నారు. ఆసిఫాబాద్ మండలం గుండి వాగు వంతెన పనులు పూర్తి చేయడంతో పాటు కరంజివాడ వంతెనకు సంబంధించిన నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. ‘మన ఊరు–మన బడి’ మొదటి విడతలో భాగంగా జిల్లాలోని పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులపై పూర్తిస్థాయి నివేదిక రూపొందించాలన్నారు. ఆయా పాఠశాలల్లో మిగిలి ఉన్న అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కెరమెరి: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మల్లేశ్ కోరారు. శనివారం జేపీఎస్‌ల ఆధ్వర్యంలో ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంపీవో సుదర్శన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మూడేళ్ల గడువు పూర్తి కావడంతోపాటు మరో ఏడాది కూడా పూర్తయినా ఎలాంటి కార్యాచరణ లేదని పేర్కొన్నారు. వెంటనే ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో ఈ నెల 28వరకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే మే ఒకటి నుంచి ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. జేపీఎస్‌లు వికాస్, సరిత, ధర్మా, వాజిద్, సతీశ్, శ్రీకాంత్, రమేశ్, విలాస్ తదితరులున్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న జేపీఎస్‌లు

భానుడి భగభగ



కౌటాల: జిల్లాలో సూర్యుడు ఠారెత్తిస్తున్నాడు. రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండగా జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు. వేడిగాలులు వీస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు పెరగడంతో వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు. రాష్ట్రంలోనే అధికంగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కౌటాలలో శనివారం పగటి ఉష్ణోగ్రతలు 43.9 డిగ్రీలు నమోదయ్యాయి.

శనివారం జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
కౌటాల	43.9	26.3
కెరమెరి	42.8	22.4
వంకులం	42.6	27.6
తిర్యాణి	42.4	25.4
ఆసిఫాబాద్	42.4	27.7
ఎల్కపల్లి	41.9	26.5
బెజ్జూర్	41.8	27.5
రెబ్బెన	41.8	26.1
కాగజ్‌నగర్	41.7	26.1
వాంకిడి	41.2	27.1

చాపకింద నీరులా బెట్టింగ్

- గ్రామాలను పాకిన విష సంస్కృతి
- ఆన్‌లైన్ యాప్‌లతో ఆగమాగం
- బానిసలుగా మారుతున్న యువత
- ఐపీఎల్ నేపథ్యంలో అధికారుల నిఘా

కౌటాల(సిర్పూర్): గతంలో నగరాలు, పట్టణాలకే పరిమితమైన బెట్టింగ్ విష సంస్కృతి పల్లెలకూ పాకింది. శుక్రవారం నుంచి ఐపీఎల్ టోర్నమెంట్ ప్రారంభమైన నేపథ్యంలో యువకులు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల సాయంతో ఇంటి నుంచే పందెం కాయనున్నారు. దేశంలో ఐపీఎల్‌కు విపరీతమైన క్రేజ్ ఉండగా దీనిని కొందరు అక్రమ దందాగా మార్చుతున్నారు. గతంలో ఢిల్లీ, ముంబై, బెంగళూర్, హైదరాబాద్ లాంటి నగరాలకే బెట్టింగ్ పరిమితమయ్యేది. కాలక్రమేణా ఈ భూతం జిల్లాలోనూ చాపకింద నీరులా విస్తరిస్తోంది. తెలిసీతెలియక చాలామంది డబ్బులు పెట్టి అప్పుల పాలవుతున్నారు. ముఖ్యంగా కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, కౌటాల, తిర్యాణి, రెబ్బెన, వాంకిడి, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాల్లో బెట్టింగ్ జోరుగా సాగుతోంది.

అంతా స్మార్ట్ ఫోన్లలోనే..
గతంలో ఫోన్‌లో బెట్టింగ్‌కు పాల్పడుతున్న బుకీలు కాలం మారడంతో ప్రత్యేక యాప్‌లను వినియోగిస్తున్నారు. జట్టులోని ప్రతి క్రీడాకారుడి ఆటతీరు..? చివరగా మ్యాచ్ టూ మ్యాచ్ గెలిచేదెవరు..? ఇలా బెట్టింగ్ కాస్తున్నారు. మన రాష్ట్రంలో నిషేధించిన డ్రీమ్ 11, రమ్మీలాంటి యాప్‌ల్లోనూ భారీగా బెట్టింగ్ నడుస్తోంది. ఈ యాప్‌ను వాడేందుకు ఫోన్‌లో ఫేక్ జీపీఎస్ అనే యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని తమ లొకేషన్‌ను హర్యానా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర లాంటి ప్రాంతాలకు మార్చి వినియోగిస్తున్నారు. అందులో రూ.25 నుంచి రూ.20వేల వరకు బెట్టింగ్ కొనసాగుతోంది. యువకులతో పాటు చిరువ్యాపారులు కూడా బెట్టింగ్ మోజులో పడి ఉన్నదంతా పోగొట్టుకుని అప్పుల పాలవుతున్నారు. గతంలో హైదరాబాద్ కేంద్రంగా సాగే ఈ దందా.. ఇప్పుడు జిల్లాలోని అన్ని పల్లెలకు పాకడం కలవరపెడుతోంది. ఎవరితో సంబంధం లేకుండానే సెల్‌ఫోన్‌లోనే క్రికెట్ బెట్టింగ్ యాప్‌లు నిక్షిప్తం చేసుకుంటున్నారు. ఫోన్‌పే, గూగుల్ పే యూపీఐ ఐడీలతో డబ్బులు బదిలీ చేస్తూ గుట్టు చప్పుడు కాకుండా బెట్టింగ్ చేస్తున్నారు. వారి తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాలు అనుసంధానం చేసి ఉన్న యూపీఐ ఐడీల ద్వారా డబ్బులు పందెం కాస్తున్నారు. ఈజీమనీ కోసమే ఈ దారి ఎంచుకుంటున్న యువత తమ కెరీర్ ఇబ్బందుల్లో పడుతుందనే విషయాన్ని విస్మరిస్తున్నారు.



గతంలో జరిగిన ఘటనలు..
గతంలో జిల్లా కేంద్రానికి చెందిన కొంతమంది, కాగజ్‌నగర్‌కు చెందిన కొందరు బెట్టింగులకు పాల్పడుతూ పోలీసులకు చిక్కారు. 2021 అక్టోబర్ 6న కౌటాల మండలం ముత్తంపేట గ్రామంలో ఇద్దరు ఔరంగబాద్‌కు చెందిన వ్యక్తితో ఐపీఎల్ వెబ్‌సైట్‌లో బెట్టింగ్ నిర్వహిస్తుండగా పక్కా సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రెండు ఫోన్లు, రూ.10,050 నగదు స్వాధీనం చేసుకున్నారు. గతేడాది ఐపీఎల్ సమయంలో కాగజ్‌నగర్ డివిజన్‌కు చెందిన యువకులు క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతూ పట్టుబడగా.. వీరి నుంచి నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలతో గతేడాది సెప్టెంబర్‌లో కౌటాలలో విధులు నిర్వహించిన ఓ ఎస్సై, కానిస్టేబుల్‌ను పోలీస్ ఉన్నతాధికారులు ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేయడం గమనార్హం. బెట్టింగ్ దందాను రూపుమాపేందుకు పోలీసులు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక నిఘా తప్పనిసరి..
ఐపీఎల్ ప్రారంభం కావడంతో పోలీసులు దీనిపై ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. బెట్టింగ్‌లో కళాశాలల విద్యార్థులు, నిరుద్యోగ యువత ఎక్కువ సంఖ్యలో పాల్గొంటున్నారు. బెట్టింగ్ కట్టడి ఇంటి నుంచే జరగాలి. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. డబ్బు ఖర్చు పెడుతున్న తీరు తెలుసుకోవాలి. పిల్లలు పెద్ద మొత్తంలో డబ్బులు అడిగినప్పుడు ఎందుకు? అని ఆరా తీయాలి. పెడదారిన వెళ్తున్నట్లు అనిపిస్తే వెంటనే వారికి కౌన్సెలింగ్ ఇప్పించాలి. అవగాహన సదస్సులకు పంపించాలి. పోలీసులు, అధికారులు అనుమానం ఉన్న యువతకు సంబంధించిన బ్యాంక్ ఖాతాల నగదు బదిలీలను పరిశీలిస్తే కొంతైనా అడ్డుకోవచ్చు. బెట్టింగ్ రాయుళ్ల ఫోన్ల విని యోగంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలి.

ప్రత్యేక దృష్టి సారించాం



క్రికెట్ బెట్టింగ్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాం. గతంలో పలువురిపై కేసులు నమోదు చేశాం. అవసరం మేరకే తల్లిదండ్రులు పిల్లలకు డబ్బులివ్వాలి. క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడి యువకులు ఆర్థికంగా నష్టపోవద్దు. నిషేధిత యాప్‌ల్లో బెట్టింగ్‌కు పాల్పడి పట్టుబడితే శిక్ష తప్పదు. ఎవరైనా బెట్టింగ్ పెడుతున్నట్లు తెలిస్తే మాకు సమాచారం ఇవ్వండి. సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచుతాం.

– సాధిక్ పాషా, సీఐ, కౌటాల

గురుకుల విద్యార్థిని మృతి

- గోప్యత పాటిస్తున్న యాజమాన్యం
- కొద్దిరోజులుగా అస్వస్థతకు గురైనా ఆస్పత్రికి తరలించని వైనం
- ఆస్పత్రి ఎదుట బంధువులు, వివిధ పార్టీలు, సంఘాల ఆందోళన

సిర్పూర్(టి)/కాగజ్‌నగర్‌టౌన్: మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల (కాగజ్‌నగర్)కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని సోదరి శ్రీవాణి (14) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. శ్రీవాణి కొద్దిరోజులుగా అనారోగ్యానికి గురై అస్వస్థతకు గురికాగా శుక్రవారం సిర్పూర్(టి)లోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం తిరిగి పాఠశాలకు తీసుకువచ్చారు. శనివారం తీవ్ర అస్వస్థతకు గురికాగా ప్రిన్సిపాల్ సంగీత, జేఎస్ఎం అంజలి వెంటనే కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించగా స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు అప్పటికే విద్యార్థిని మృతి చెందినట్లు ధ్రువీకరించారు. తల్లి లలితకు సమాచారం ఇచ్చారు. సీహెచ్‌సీలో మృతదేహాన్ని ఉంచి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ సీఐ బుద్దె స్వామి, కౌటాల సీఐ సాదిక్‌పాషాతో కలిసి ఎస్సైలు బందోబస్తు నిర్వహించారు. విద్యార్థిని తల్లిదండ్రులు లలిత–సమ్మయ్య ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించారు. ఈక్రమంలో లలిత స్పృహ తప్పి కిందపడిపోగా ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. కాగా, ప్రిన్సిపాల్, జేఎస్ఎం, ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతోనే తన కూతురు మృతి చెందిందని సమ్మయ్య ఆరోపించాడు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్, కాంగ్రెస్ తాలూకా నాయకుడు రావి శ్రీనివాస్, సీఐటీయూ నాయకుడు ముంజం ఆనంద్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, పరిహారం చెల్లించాలని, ప్రిన్సిపాల్‌తో పాటు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతదేహాన్ని తీసుకెళ్లాలని పోలీసులు, అధికారులు సూచించగా.. బాధిత కుటుంబీకులు నిరాకరించారు. అధికారులు ఎంత నచ్చజెప్పినా వారు ససేమిరా అన్నారు. లలిత–సమ్మయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లుండగా శ్రీవాణి పెద్ద కూతురు.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



శ్రీవాణి (ఫైల్)



రోదిస్తున్న తల్లిదండ్రులు

ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ఉద్రిక్తత
శ్రీవాణి బంధువులు శనివారం రాత్రి ఆస్పత్రికి చేరుకోగానే తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో విద్యార్థిని మృతదేహాన్ని ఉంచగా తీసుకువెళ్లేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు నిరాకరించారు. తమకు న్యాయం చేయాలని, శ్రీవాణి మృతికి కారకులైన వారిని తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేస్తూ సీహెచ్‌సీ ఎదుట బైఠాయించారు. వీరికి వివిధ పార్టీలు, సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం ఆస్పత్రిలోకి వెళ్లేందుకు ఆందోళనకారులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రాత్రి 11గంటల వరకూ కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహాన్ని తీసుకువెళ్లలేదు.

‘రెగ్యులర్ ఉత్తర్వులు ఇవ్వకుంటే సమ్మె’

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం 2021లో జారీ చేసిన జీవో ప్రకారం తేదీ:11.04.2023 నుంచి తమ సర్వీస్‌ను రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలని, లేని పక్షంలో ఈనెల 28నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ స్పష్టం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్‌రావ్, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్‌కు సమ్మె నోటీసు అందజేశారు. అంతకుముందు అధికసంఖ్యలో కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. జీవో ప్రకారం రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత నాలుగేళ్ల కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలని, ప్రస్తుతం పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులనూ రెగ్యులర్ చేయాలని కోరారు. క్యాడర్ స్ట్రెంత్ నిర్ధారణ చేయడంతోపాటు అర్హులకు పదోన్నతి కల్పించాలన్నారు. 317 జీవో కారణంగా నష్టపోయినవారికి న్యాయం చేసి, పరస్పర బదిలీలకు అనుమతించాలన్నారు. డిమాండ్లు త్వరగా నెరవేర్చకుంటే ఈనెల 28నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్‌గౌడ్, నాయకులు ప్రదీప్‌గౌడ్, మల్లేశ్, రాకేశ్, మల్లీశ్వరి, మనీశ్, వంశీ, ప్రేమ్‌సాగర్, నాయకులు వికాస్, తిరుపతి, శ్రీకాంత్, రవికుమార్, శ్రీనివాస్, హరిదాస్, మారుతి, శ్రీజ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న కార్యదర్శులు

క్లుప్తంగా

కాసిపేట గనిని సందర్శించిన మాన్‌సూన్ ఆడిట్ కమిటీ


కాసిపేటగనిపై కమిటీ సభ్యులు, అధికారులు

కాసిపేట: మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిని శనివారం ప్రీ మాన్‌సూన్ (రుతు పవనాల వల్ల సంభవించే అనార్థల నివారణ) ఆడిట్ కమిటీ సభ్యులు సందర్శించారు. కమిటీ కన్వీనర్ ఏరియా రక్షణాధికారి ఆర్‌జీ 3 వెంకటరమణ కమిటీ సభ్యులతో కలిసి కాసిపేట దేవాపూర్ వాగు, కాసిపేట, వరిపేట సాండ్ స్టోయింగ్ బంకర్లు, నార్త్ సైడ్ నాళా, కాసిపేట టన్నల్, చిన్నధర్మారం చెరువులను పరిశీలించారు. అధికారులకు భవిష్యత్ కార్యచరణపై పలు సూచనలు చేశారు. సభ్యులు డీజీఎం సర్వే ఆర్‌జీ 3 జైలావుద్దీన్, గని మేనేజర్ అల్లావుద్దీన్, రక్షణాధికారి సునీల్‌కుమార్, సర్వేయర్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

పరీక్ష కేంద్రం @ 400 కిలో మీటర్లు



హాల్‌టికెట్ చూపుతున్న విద్యార్థి రాంచరణ్

వేమనపల్లి: ప్రభుత్వం నిర్వహించే గురుకుల ప్రవేశ పరీక్ష మండల కేంద్రంలోని చిప్ప రాంచరణ్‌కు అందని ద్రాక్షగా మారింది. 7వ తరగతి ప్రవేశ పరీక్ష రాయడానికి 400 కిలోమీటర్ల దూరంలోని మహబూబ్‌నగర్ జిల్లాకు వెళ్లాలని అధికారులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌లో నిక్షిప్తం చేశారు. విద్యార్థి కథనం ప్రకారం .. మండల కేంద్రానికి చెందిన చిప్ప రాంచరణ్ 6వ తరగతి చదువుతున్నాడు. టీఎస్ఆర్ గురుకులంలో ఖాళీ ఉన్న మిగులు సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యార్థి ఖాళీలు ఉన్న ఉమ్మడి జిల్లాలోని ఇచ్చోడ, జైపూర్, ఆసిఫాబాద్, టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ గురుకులాలలో సీట్లు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. వీటికి ఉమ్మడి జిల్లా పరిధిలోనే ప్రవేశ పరీక్ష నిర్వహించాల్సింది. 16వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా రాంరెడ్డిగూడంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో పరీక్ష రాయాల్సిందిగా హాల్‌టికెట్‌లో ఆన్‌లైన్ చేశారు. ఒక వైపు ఆరో తరగతి ప్రవేశ పరీక్షతో పాటు మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష కూడా అదే రోజు ఉండడంతో విద్యార్థి ఏ పరీక్షకు హాజరు కావాలో అయోమయంలో పడ్డాడు. 400 కిలోమీటర్ల దూరంలోని ప్రవేశ పరీక్షకు హాజరుకాలేక నష్టపోతున్నట్లు వాపోయాడు.

గుండెనొప్పితో మహిళ మృతి


పోసమ్మ(ఫైల్)


జైపూర్: గుండెపోటుతో మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... చెన్న పోసమ్మ (38) నస్పూర్‌లోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సత్యాగ్రహ బహిరంగ సభకు వెళ్లింది. తిరిగి రాత్రి బస్సులో ఇంటికి చేరుకుంది. ఛాతిలో నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త రాజయ్య, కొడుకు శేఖర్, కూతురు లక్ష్మి ఉన్నారు.



ప్రకృతిలో పక్షుల సోయగం

కవ్వాల్ అడవులు పక్షులకు అవాసాలుగా మారాయి. రకరకాల పక్షులు కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం అడవులలో అవాసాలుగా ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఇటీవల బర్డ్ వాక్ లో పలు రకాల పక్షులు కనిపించాయి. శనివారం అటవి అధికారులు తీసిన ఫొటోలలో స్థానికంగా కనిపించే పక్షులతో పాటు, వలస పక్షులు కూడా తమ సోయగాలను చూపించాయి. వలస పక్షులైనా గ్రే హీడేడ్ ఫిష్ ఈగల్, బ్లాక్ హీడెడ్ ఈగల్, లిటిల్ కార్మోరెంట్, ఓరియంటల్ డర్టెల్, రెడ్ వాటిల్డ్ లాపింగ్ పక్షులు కెమెరాలో చిక్కాయి. ప్రతి సంవత్సరం శీతాకాలం వరకు ఉండే ఈ పక్షులు ఈ సంవత్సరం వేసవిలో కూడా ఇక్కడే అవాసాలు ఏర్పాటు చేసుకుని ఉండటం మంచి పరిణామమని డిప్యూటీ కన్జర్వేటర్ సిరిపురం మాధవరావు తెలిపారు. - జన్నారం

వామ్మో.. వానరాలు




- నేరుగా ఇళ్లలోకి వచ్చి చేరుతున్న వైనం
- రామకృష్ణాపూర్, సీసీసీ, చెన్నూర్‌లలో ఇదే వరుస
- వన్యప్రాణి చట్టం సాకుగా చూపుతున్న అధికారులు
- ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని ప్రజల వేడుకోలు

పట్టణంలోని బీజోన్ ఏరియాకు చెందిన కంకులు అమ్ముకునే భూమక్క ఇటీవల కోతుల దాడిలో గాయపడింది. ప్రతీ రోజు కంకులను ఎత్తుకెళ్తుండడంతో ఆర్థికంగా నష్టపోవటమే కాకుండా అడ్డుకునే ప్రయత్నంలో వాటి దాడిలో గాయపడింది. ఏ వైపు నుంచి కోతులు దాడిచేస్తాయోనని భయంతో చిరు వ్యాపారం చేసుకుంటుంది భూమక్క. ఇలా జిల్లాలో పలువురు చిరువ్యాపారులే కాదు సామాన్య ప్రజలు సైతం తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కోతులను అరికట్టాలని కోరుతున్నారు.

రామకృష్ణాపూర్: ×అసలే కోతి..పైగా కల్లు తాగితే₹ అన్నట్లుంది పరిస్థితి. వానరాల బెడదతో కొన్ని కోల్‌బెల్ట్ ప్రాంతాలు బిక్కుబిక్కుమంటున్నాయి. ప్రశాంతంగా రోడ్డునపోయే ఆస్కారం లేకుండా పోయింది. ఏ వైపు నుంచి వస్తాయో చేతులోని కవర్లను ఎలా గిరాటేస్తాయో తెలియని అయోమయస్థితి. జిల్లాలోని చెన్నూర్, రామకృష్ణాపూర్, సీసీసీ, శ్రీరాంపూర్ ప్రాంతాల్లో ఇదే తరహా వాతావరణం నెలకొంది. ఒక్కోసారి నేరుగా ఇళ్లల్లోకి చొరబడుతున్నాయి. ఈ బాధ నుంచి విముక్తి కల్పించాల్సిన అధికారులు వ్యన్యప్రాణి చట్టాన్ని సాకుగా చూపి చర్యలకు వెనుకంజ వేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అధికారులు స్పందించాలి...

కోతుల సంచారంతో నెలకొన్న ఆందోళనకర పరిస్థితులకు సంబంధిత అధికారులు అడ్డుకట్ట వేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా వన్యప్రా ణి చట్టాన్ని బూచీగా చూపిస్తు అధికారులు కనీస స్పందన లేకుండా ఉంటున్నారని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లల్లోకి చొరబడుతూ చిన్నపిల్లలు, పెద్దలపై దాడులు చేస్తున్నప్పటికీ అధికారులు కిమ్మనక పోవడంపై ప్రజలు బాహాటంగానే మండిపడుతున్నారు. ఒకవేళ కోతులు కరిచిన పక్షంలో వైద్యచికిత్సలు కూడా చాలా ఖర్చుతో కూడుకుంటున్నాయ ని కలవరపడు తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శా ఖల అధికారులు అప్రమత్తమై వీటిని పట్టుకునేందుకు బోనులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బయటకు వెళ్లేందుకు ఆందోళన..



రోజురోజుకూ అధికమవుతున్న కోతులబెడదతో తట్టుకోలేక పోతున్నామని పట్టణ ప్రజలు వాపోతున్నారు. చెన్నూర్, సీసీసీ, శ్రీరాంపూర్ తదితర ప్రాంతాల్లో కోతులు ఇళ్లల్లోకి వచ్చి పప్పుడబ్బాలు లాక్కునిపోతుండటం గమనార్హం. చిన్న పిల్లలను బయటకు పంపేందుకు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఒక్కోసారి వారిపై ఎగబడి గాయాలు చేస్తున్నాయి. స్థానిక ఠాగూర్‌స్టేడియం సమీపంలోని పార్కుకు ఆహ్లాదం కోసం వెళ్తే అక్కడ కూడా కోతుల సంచారం ఉండడంతో స్థానికులు వెళ్లేందుకు జంక్కుతున్నారు.

కోతులను తరలించేందుకు గైడ్‌లైన్స్ రావాలి



కుక్కలను నిర్మూలించటానికి ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) విధానాన్ని తీసుకువచ్చి మున్సిపాలిటీలకు గైడ్స్‌లైన్స్‌ను ఇచ్చారు. అయితే కోతులను పట్టుకుని తరలించేందుకు ఎలాంటి గైడ్‌లైన్స్ ఉన్నతాధికారుల నుండి రాలేదు. వస్తే కోతులను సురక్షితంగా అడవుల్లోకి తరలించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటాం. – వెంకటనారాయణ, క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్

25న జీఎం కార్యాలయం ఎదుట ధర్నా


మాట్లాడుతున్న ఎస్కే బాజీసైదా

శ్రీరాంపూర్: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 25న శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ డెప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్కే బాజీసైదా, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముస్కె సమ్మయ్యలు తెలిపారు. శనివారం శ్రీరాంపూర్ ఓసీపీలో జరిగిన సమావేశంలో వారు కాంట్రాక్ట్ కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు 2020 నుంచి సీఎంపీఎఫ్ చీటీలు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటికి ఇవ్వలేదన్నారు. దీంతో వారి అకౌంట్లలో ఎన్ని డబ్బులు జమ అయ్యాయో తెలియక సతమతం అవుతున్నారన్నారు. గతంలో సమ్మె సందర్భంగా ఆర్ఎల్సీ సమక్షంలో జరిగిన ఒప్పందాలను వెంటనే అమలు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులందరికి కోలిండియాలో ఇస్తున్నట్లుగా హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కంపెనీలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వాలని, కంపెనీ ఆసుపత్రుల్లో పర్మినెంట్ ఉద్యోగులకు అందిస్తున్నట్లు కాంట్రాక్ట్ కార్మికులకు కూడా వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధనలో భాగంగా జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాల్సిందిగా కాంట్రాక్ట్ కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, మండల కార్యదర్శి దొడ్డిపట్ల రవీందర్, నాయకులు చంద్రమోహన్ ఉన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న ఎఫ్‌డీపీటీ

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవి డివిజన్‌లో శనివారం టైగర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ క్రమంలోని డివిజన్‌లోని చింతగూడ గ్రాస్ ప్లాంటేషన్, మల్యాలలోని జింకల పునరుత్పత్తి కేంద్రం , నూతనంగా నిర్మించ తలపెట్టిన రిసర్ట్‌ల పనులను పరిశీలించారు. అదే విధంగా నీటి సౌకర్యాలు, గడ్డి క్షేత్రాలపై తీశారు. అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణపై ఎఫ్‌డీవో మాధవరావు ను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట రేంజ్ అధికారులు హఫీజోద్దీన్, రత్నాకర్‌రావు ఉన్నారు.

నిందితుడిని అరెస్టు చేసిన రాజస్థాన్ పోలీసులు

రెబ్బెన(ఆసిఫాబాద్): డ్రగ్స్ స్మగ్లింగ్ కేసులో పరారీలో ఉన్న నిందితుడిని రెండ్రోజుల క్రితం రాజస్థాన్ పోలీసులు రెబ్బెన మండల కేంద్రంలో అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్ రాష్ట్రంలోని పాలి జిల్లా హా అంజావా గ్రామానికి చెందిన రతన్‌సింగ్‌పై 2016లో డ్రగ్స్ స్మగ్లింగ్ కేసు నమోదైంది. రాజస్థాన్ రాష్ట్రం నుంచి పరారై వచ్చి రెబ్బెన మండలంలోని ఓ స్వీట్ షాపులో పని చేస్తున్నాడు. రాజస్థాన్ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపులు చర్యలు చేపట్టారు. పక్కా సమాచారం మేరకు మండలానికి వచ్చి నిందితుడిని పట్టుకుని రాజస్థాన్‌కు తరలించారు. ఈ విషయమై రెబ్బెన ఎస్సై భూమేష్‌ను సంప్రదించగా రతన్‌సింగ్‌పై డ్రగ్స్ స్మగ్లింగ్ కేసు నమోదైందని, అక్కడి పోలీసులు రాజస్థాన్‌కు తరలించారని పేర్కొన్నారు.

అక్రమ వెంచర్లలో హెచ్చరిక బోర్డులు


సీతారాంపల్లిలోని అక్రమ వెంచర్‌లో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

నస్పూర్: పట్టణ పరిధిలోని ఎలాంటి అనుమతులు లేని అక్రమ వెంచర్లలో హెచ్చరిక బోర్డులను మున్సిపల్ సిబ్బంది ఏర్పాటు శనివారం చేశారు. ఈ నెల 11న సాక్షిలో ప్రచురితమైన 'అనుమతి లేని వెంచర్... నిర్మాణానికి ఇక్కట్లు'శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మున్సి పాలిటీ నుంచి అనుమతులు లేకుండా వెలసిన అక్రమ వెంచర్లలో హెచ్చరిక బోర్డులను మున్సిపల్ సిబ్బంది శనివారం ఏర్పాటు చేశారు. అక్రమ లే అవుట్లలో లేదా అనుమతి లేని లే అవుట్లలో ప్లాట్లు కొనవద్దని, ఇలాంటి వాటికి ఎప్పటికి అనుమతులు ఇవ్వలేమని కమిషనర్ రమేశ్ తెలిపారు. పట్టణ పరిధిలోని సీతారాంపల్లిలోని నాలుగు, తీగల్‌పహడ్‌లోని ఒకటి, సంఘం మల్లయ్యపల్లిలో రెండు, సింగాపూర్ ఆర్ అండ్ ఆర్ సైట్ పక్కన గల ఒక వెంచర్లతో కలిపి మొత్తం ఎనిమిది అక్రమ వెంచర్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

రేషన్ దుకాణం సీజ్


రేషన్ షాపు సీజ్ చేస్తున్న తహసీల్దార్

మందమర్రిరూరల్: పట్టణంలోని అంగడీబజార్ ఏరియాలోని 64వ నంబర్ గల రేషన్ దుకాణాన్ని శనివారం తహసీల్దార్ సంపతి శ్రీనివాస్ సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా లబ్దిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేయడం లేదని, షాపును ఓపెన్ చేయడం తో పాటు ఫోన్‌లో సైతం స్పందించకపోవడంతో రేషన్ బియ్యం కోసం పలువురు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో లబ్దిదారుల ఫిర్యాదు మేరకు షాపును సీజ్‌చేసినట్లు తెలిపారు.

బావిలో దూకి ఒకరి ఆత్మహత్య

లక్సెట్టిపేట: బావిలో దూకి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని గాంధీనగర్‌లో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం... రాచర్ల అజయ్ (40) వయస్సు దాటిపోయినా ఇంకా పెళ్లి కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజులుగా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసినా వారి వద్ద ఆరా తీసిన ఫలితం కానరాలేదు. శనివారం అంకతివాడ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో అజయ్ మృతదేహం కనిపించింది. తండ్రి చిలుకయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రాజెక్ట్‌లో దూకి వృద్ధుడు..

పెంచికల్‌పేట్: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఎల్లూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌చార్జి ఎస్సై ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుర్గం నానయ్య (80) రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రులకు వెళ్లినా ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మానసికంగా తీవ్రంగా కుంగిపోయి గ్రామ సమీపంలోని బొక్కివాగు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు పోశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో విద్యార్థి మృతి


వికాస్‌రాజ్ మృతదేహం

మందమర్రిరూరల్: గుండెపోటుతో ఇంటర్ విద్యార్థి మృతిచెందిన సంఘటన శనివారం పట్టణంలో వెలుగు చూసింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... పట్టణంలోని మొదటి జోన్‌కు చెందిన పెంటపర్తి వికాస్‌రాజ్ (17) కరీంనగర్ జిల్లా వేములవాడలోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ఇటీవల పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాడు. శనివారం ఉదయం ఎడమ చేతితో పాటు ఎడమ వైపు శరీర భాగం లాగుతుందని చెప్పడంతో కుటుంబీకులు సమీపంలోని ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకున్నారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యుడు తెలుపడంతో 108లో సింగరేణి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. తండ్రి సురేశ్ బ్యాంకు ఉద్యోగి కాగా ఒక్కగానొక కుమారుడు మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

చేపల వలలో మొసలి..


చేపల వలకు చిక్కిన మొసలిని చూపిస్తున్న జాలర్లు...

దండేపల్లి: మండలంలోని పెద్దపేట చెరువులో శనివారం జాలర్లు చేపల వేటకు వెళ్లారు. వలతో చేపలు పడుతుండా అందులో మొసలి చిక్కింది. గమనించిన జాలర్లు మొసలిని ఒడ్డుకు తెచ్చి తాళ్లపేట అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు అక్కడికి చేరుకుని మొసలిని గూడెం గోదావరి నదిలో వదిలిపెట్టారు. ఈ చెరువులో చేపల వలకు మొసలి చిక్కడం ఇది రెండోసారి. ఈ నెల 7న కూడా చేపలు పడుతుండా వలలో మొసలి పిల్లచిక్కిన విషయం తెలిసిందే.

ఆగని ఇళ్ల నిర్మాణాలు


ఇళ్ల చుట్టూ ప్రహరీ నిర్మాణం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ కన్నాల శివారు ప్రాంతంలో ప్రభుత్వ భూమిని అక్రమించి శాశ్వ త కట్టడాలను కడుతున్నారు. రోజువారీగా ఇళ్ల నిర్మాణ పనులు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. కన్నాల శివారులోని సర్వే నంబర్ 112 లోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసి దర్జాగా పక్కా గృహాల నిర్మాణం చేస్తున్నారని వార్తా కథనాలు వచ్చిన అధికారుల్లో చలనం లేదు. ఇప్పటికే ఇంటి నిర్మాణాను పూర్తి చేసిన అక్రమార్కులు తాజాగా కట్టుకున్న ఇళ్ల చుట్టు సిమెంట్ పలకలతో ఏకంగా ప్రహరీ నిర్మిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే అక్రమకట్టడాల నిర్మాణాలను నిలుపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రాలిన రైతుల ఆశలు


జంగాల్‌పేటలో కాయలు ఏరుతున్న రైతులు

నెన్నెల: చేతికి అందివచ్చిన మామిడి సాగు శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో నేలరాలింది. దీంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి. గత నెలలో వీచిన గాలివానకు 25శాతం, ఈసారి అకాల వర్షానికి 20శాతం కాయలు నేలరాలాయి. మండలంలోని నెన్నెల, లంబాడీతండా, కోణంపేట, మన్నెగూడం, జంగాల్‌పేట, నందులపల్లి, గన్‌పూర్ గ్రామాల్లోని మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.